ప్రజాశక్తి
మంగళవారం 15 అక్టోబర్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కూటమికే మద్యం దుకాణాలు

- ముందుగానే సిండికేట్లు రింగ్
- షాపులు దక్కించుకునేందుకు భారీగా దరఖాస్తులు
- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సజావుగా ముగిసిన లాటరీ

అనకాపల్లిలో లాటరీ తీస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

విశాఖలో లాటరీ తీస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి, ఎంవిపి.కాలనీ విలేకరులు

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియ సోమవారం సజావుగా సాగింది. అనకాపల్లి జిల్లాను పరిశీలిస్తే.. అనుకున్నట్లే మద్యం దుకాణాలను దక్కించుకొనేందుకు సిండికేట్లు రింగ్ అయ్యారు. లాభాపేక్ష వ్యాపార వాసన తెలిసిన టిడిపి, జనసేన, బిజెపి, వైసిపి నాయకుల్లో కొందరు జిల్లాలో మద్యం దుకాణాలు వేరొకరికి వెళ్లకుండా మండలాల వారీగా ఏకమయ్యారు. దరఖాస్తు సమయంలో ఎవరెవరు ఎన్ని దరఖాస్తులు ఏ షాపులకు పెట్టాలో నిర్ణయించుకొని ధరావత్తు కట్టారు. దరఖాస్తుకు కట్టిన డబ్బులో రెండు లక్షల రూపాయలు తిరిగిరావని తెలిసినా, సిండికేట్‌గా 60 నుంచి వందకు పైగా దరఖాస్తులు చేశారు. ముందుగానే వ్యాపారులు కూటమిగా ఏర్పడ్డంతో అనకాపల్లి జిల్లాలో ప్రభుత్వం నోటిఫై చేసిన 136 మద్యం దుకాణాలకు 3291 దరఖాస్తులొచ్చాయి. దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.65.82 కోట్ల ఆదాయం లభించింది. స్థానిక లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం డ్రా తీశారు. ఉదయం 8 గంటలకు లాటరీ ఏర్పాట్లను జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ పూర్తిచేశారు. మద్యం వ్యాపారులతో ఫంక్షన్ హాల్ కిక్కిరిసినా, వారంతా కుమ్మక్కైరావడంతో లాటరీ ప్రక్రియ సజావుగా ముగిసింది.

లాటరీలో మద్యం దుకాణ లైసెన్సు ఎవరికొచ్చినా, దాని నిర్వహణ ఎవరెవరు కలిసి చేయాలనేది కూడా వ్యాపారులు మాట్లాడుకున్నారు. దుకాణాలు ఎక్కడ పెడితే మిగతా 2లో..

అనకాపల్లిలోని లక్ష్మి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌కు భారీ సంఖ్యలో చేరుకున్న దరఖాస్తుదారులు

అల్పపీడనం నేపథ్యంలో..

అప్రమత్తంగా ఉన్నాం

రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆమె అనంతరం మీడియాతో కాసేపు మాట్లాడారు. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడామని, ఎలాంటి ప్రమాదమూ జరగకుండా ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధం చేసి ఉంచామని తెలిపారు. తుపాను వల్ల ఏయే ప్రాంతాలు ప్రమాదానికి గురయ్యే అవకాశముందో ముందుగా గుర్తించి రక్షణ బృందాలను అక్కడకు పంపిస్తామని తెలిపారు. తుపాను షెల్టర్లను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికే కర్నూలు, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం ప్రాంతాలను అప్రమత్తం చేశామని, ప్రతి మండలంలోనూ, జిల్లా కేంద్రంలోనూ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. గంట గంటకూ ఎంత వర్షపాతం నమోదవుతుందో పర్యవేక్షించి ముందస్తు చర్యలు చేపడతామని ఆమె తెలిపారు. ఇప్పటికే సెలవులో ఉన్న అధికారులను సైతం విధుల్లోకి తీసుకుంటున్నామని, అత్యాధునిక టెక్నాలజీతో పాటు డ్రోన్లను కూడా వినియోగానికి సిద్ధం చేశామని తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఏర్పడితే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేసిన ఇపిడిసిఎల్

సీతమ్మధార : భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ఇమ్మడి పృథ్వీతేజ్ సంస్థ పరిధిలోని 11 జిల్లాల అధికారులను అప్రమత్తం చేశారు. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతా రామరాజు జిల్లాలతో పాటు కోనసీమ, కాకినాడ, ఏలూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ముందస్తు ఏర్పాట్లు చేసినట్టు సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి అంతరాయాలూ లేకుండా చూడాలని, అవసరమైన యంత్రాంగం, పరికరాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఎస్‌ఇ, ఇఇలను ఆదేశించారు. తుపాను వల్ల ఏర్పడే విద్యుత్ అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని అందించేందుకు మిగతా 2లో..

సమస్యలపై హెల్త్ సెక్రటరీల ధర్నాలు

వార్త 5లో..

అధ్యయనం పేరిట విహారయాత్రలా.. ?

వార్త 2లో..

నిత్యావసరాల ధరలు తగ్గించాలి : ఐద్వా

వార్త 8లో..

భీమిలి మండలం తాళ్లవలసలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గంటా

పల్లె పండగ ప్రారంభం

గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆరంభం

వార్త 4లో..

అభిజిత్ ఫెర్రో టెక్ లాకౌట్‌పై కార్మికులు భగ్గు

- పరిశ్రమ ఎదుట ఆందోళన
- సిపిఎం, సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి - అచ్యుతాపురం

మండలంలోని అభిజిత్ ఫెర్రో టెక్ పరిశ్రమ యాజమాన్యం కనీస సమాచారం ఇవ్వకుండా లాకౌట్ ప్రకటించడంపై కార్మికులు భగ్గుమన్నారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం విధులకు వెళ్లిన కార్మికులను పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. సదరు కంపెనీ యాజమాన్యం లాకౌట్ ప్రకటించినట్లు కంపెనీ గేటుకు ఓ నోటీసు అంటించి చేతులు దులుపుకోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గేటు ఆవరణలోనే ఆందోళనకు దిగారు. యాజమాన్యం అనుసరిస్తున్న తీరుకు నిరసనగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. అభిజిత్ పరిశ్రమ గతంలోనూ ఒకసారి లాకౌట్ ప్రకటించింది. అప్పట్లో చర్చలు జరిగాక మళ్లీ పరిశ్రమను పున: ప్రారంభించింది. తాజాగా చెప్పాపెట్టకుండా మళ్లీ కంపెనీని మూసివేయడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఆందోళనకు సిపిఎం, సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ అభిజిత్ కార్మికులు ఐక్యంగా పోరాడితే ప్రభుత్వం, కంపెనీ దిగిరాక తప్పవని అన్నారు. కార్మికులు చేస్తున్న ఆందోళనకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ప్రతి కార్మికుడూ సమస్య పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం చేయాలన్నారు. లాకౌట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ఆయన సూచించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము మాట్లాడుతూ పరిశ్రమలో సుమారు మిగతా 2లో..

కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, చిత్రంలో రాము తదితరులు

మొదటి పేజీ తరువాయి..

కూటమికే మద్యం దుకాణాలు

వ్యాపారం సాగుతుందో గుర్తించారు. దుకాణ ప్రాంత జనాభా, ప్రజల రద్దీ, దీనికి అందుబాటు గ్రామాలు.. ఇలా అన్ని అంశాలనూ దృష్టిలో పెట్టుకొని షాపులను ఏర్పాటు చేస్తున్నారు. దుకాణ వ్యాపారంపైనే ఆధారపడకుండా ఏ షాపు నుంచి ఏ గ్రామాలకు మద్యం పంపించాలన్న ఏకాభిప్రాయం వ్యాపారుల్లో కుదిరింది. ఇక గ్రామాల్లో బెల్టు షాపులకు నియంత్రణ లేకుండాపోయే ప్రమాదముంది. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యేలు వారి పేరున మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయనప్పటికీ వారి బంధువులు, సమీప కుటుంబ సభ్యుల పేర దరఖాస్తు చేయించారు. కొన్ని నియోజకవర్గాల్లోని దుకాణాల్లో వాటాదారునిగా వున్నారు. మద్యం వ్యాపారంలో సమస్యలు తలెత్తకుండా కొంతమంది ప్రజాప్రతినిధులు తమ అన్నదమ్ములు, కొడుకులు, అల్లుళ్లను వాటాదారులుగా చేర్చుకున్నారు. అత్యధికంగా జనప్రియ గ్రూపు 20 దుకాణాలు పొందినట్లు ప్రచారం జరుగుతోంది. నిబంధనల ప్రకారం గడువులోపు డబ్బు చెల్లించకపోతే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ఎక్సైజ్ శాఖాధికారి సుధీర్ తెలిపారు.

విశాఖలో ఇలా..

నూతన మద్యం పాలసీలో భాగంగా విశాఖపట్నంలో సోమవారం నిర్వహించిన మద్యం షాపుల లాటరీ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సిరిపురంలోని వియంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనా వేదికగా నిర్వహించిన ఈ డ్రాను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పర్యవేక్షించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాన్యువల్ పద్ధతిలో డ్రా నిర్వహించారు. ఎక్సైజ్ శాఖ గజిట్ సీరియల్ ప్రకారం లాటరీ పద్ధతిలో దుకాణాల కేటాయింపు మధ్యాహ్నం రెండు గంటల వరకు సాగింది. విశాఖలో 155 షాపులకుగాను 4139 దరఖాస్తులు రాగా వాటన్నింటికీ లాటరీ ప్రక్రియ సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కె.రామచంద్రమూర్తి మాట్లాడుతూ జివిఎంసి పరిధిలో విశాఖపట్నం జిల్లాకు సంబంధించి 124 షాపులకు, అదేవిధంగా జివిఎంసి పరిధిలోని అనకాపల్లి జిల్లాకు చెందిన 12 షాపులకు, విశాఖపట్నం రూరల్ పరిధి భీమిలి మండలంలో నాలుగు, పద్మనాభం మండలంలో ఏడు, ఆనందపురం మండలంలో ఎనిమిది షాపులకు డ్రా నిర్వహించామన్నారు. జివిఎంసి పరిధిలోని షాపులు 85 లక్షల స్లాబ్‌లోనివికాగా, రూరల్‌లో ఉన్న 19 షాపులు 65 లక్షల స్లాబ్‌లోకి వస్తాయని, కనీస లైసెన్స్ రుసుము రూ.20 లక్షలు చెల్లించి వెంటనే ప్రొవిజినల్ లైసెన్స్ పొందవచ్చునని, దీని కాలవ్యవధి ఏడు రోజులు ఉంటుందని, ఆలోపు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా షాపు ఏర్పాటు చేసుకొని మిగిలిన లైసెన్స్ ఫీజు చెల్లించి పర్మినెంట్ లైసెన్స్‌ను రెండు సంవత్సరాల కాలపరిమితికి పొందాలని సూచించారు. డ్రాలో గెలుపొందిన వారికి లాగిన్ ఐడి, పాస్‌వర్డ్ అందజేస్తామని, మంగళవారం నుంచి వారు ఆన్‌లైన్‌లో మద్యం కొనుగోలు చేసి 16వ తేదీ నుంచి విక్రయాలు జరపవచ్చునని తెలిపారు. డ్రాలో షాపులు పొందినవారు నిర్ణీత ప్రాంతాల్లో ఎక్కడైనా షాపును ఏర్పాటు చేసుకోవచ్చునని, ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న మద్యం షాపులో మద్యం అమ్మకాలు మంగళవారం రాత్రి 9 గంటలతో ముగుస్తాయని తెలిపారు. తదుపరి కార్యాచరణ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఉంటుందని వివరించారు. మీడియా సమావేశంలో విశాఖ జిల్లా ఎక్సైజ్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

అభిజిత్ ఫెర్రో టెక్ లాకౌట్‌పై కార్మికులు భగ్గు

వెయ్యి మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, లాకౌట్ ప్రకటించడం వల్ల వారంతా రోడ్డున పడ్డారని తెలిపారు. ఎస్ఇజెడ్‌లో పరిశ్రమలు రావడం వల్ల ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పి వారి వద్ద భూములను కారు చౌకగా తీసుకున్న ప్రభుత్వాలు ఆ తరువాత వారిని పట్టించుకోవడం మానేశాయన్నారు. పరిశ్రమలు లాకౌట్ ప్రకటించడం వల్ల కార్మికుల జీవితాలు దుర్భరంగా మారతాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి లాకౌట్‌ను ఎత్తి వేయించి కార్మికులకు యధావిధిగా ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ముందుగా కార్మికులతో సంప్రదించకుండా కంపెనీని మూసివేయడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉన్నాం

కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. భారీ వర్షాల ప్రభావానికి తెగిపడిన విద్యుత్ వైర్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్లపై పడిపోయిన చెట్ల కొమ్మల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వాటి సమాచారాన్ని కార్పొరేట్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నెంబరు 1912 లేదా కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయం 8331018762 నెంబరుతో పనిచేస్తుందన్నారు. జిల్లాల కంట్రోల్ రూమ్‌లకు సంబంధించి శ్రీకాకుళం 9490612633, విజయనగరం 9490610102, పార్వతీపురం మన్యం 8332046778, విశాఖపట్నం 7382249881, అనకాపల్లి 9490610022, అల్లూరి సీతారామరాజు 9490610026, కోనసీమ 9440904477, కాకినాడ 9493178718, ఏలూరు 9440902926, తూర్పుగోదావరి 7382299960, పశ్చిమగోదావరి 9490610143 ఫోన్ నెంబర్లతో పనిచేస్తాయన్నారు.

అధ్యయనం పేరిట విహారయాత్రలా.. ?

- ప్రజాధనంతో జివిఎంసి కార్పొరేటర్ల టూర్ తగదు
- అన్ని పార్టీలూ వ్యతిరేకించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

మాట్లాడుతున్న జగ్గునాయుడు, చిత్రంలో డాక్టర్ బి.గంగారావు తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కార్పొరేటర్ల అధ్యయన యాత్రను తమ పార్టీ వ్యతిరేకిస్తోందని, అధ్యయనం పేరుతో విహారయాత్రలు చేయడం తగదని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. జగదాంబ దరి నండూరి ప్రసాదరావు భవనంలో సోమవారం జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్, సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు వి.కృష్ణారావులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జివిఎంసికి పన్నుల రూపంలో ప్రజలు చెల్లిస్తున్న ప్రజాధనంతో విహార యాత్రలకు వెళ్లడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. ఈ టూర్‌ను అన్ని పార్టీలూ వ్యతిరేకించాలని కోరారు. కోయంబత్తూర్, మైసూర్, బెంగళూర్ నగరాలను కార్పొరేటర్లు అధ్యయనం చేయడానికి ఈ నెల 20 నుంచి 27 వరకు మహా విశాఖ నగర పాలక సంస్థ టూర్ ప్రోగ్రాంను నిర్ణయించిందన్నారు. అందులో అధ్యయనం కోసం కేవలం 3 గంటలు మాత్రమే కేటాయించారన్నారు. మిగతా రోజులన్నీ విహారయాత్రలేనని, అందుకే ఈ యాత్రను తమ పార్టీ వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఈ టూర్‌ను సిపిఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యాత్రకు పెట్టే ఖర్చు ప్రజా అవసరాలకు వినియోగించాలని కోరారు. గతంలో అధ్యయన యాత్రలకు వెళ్లి విశాఖను ఏం అభివృద్ధి చేసారని ప్రశ్నించారు. పేరుకే గ్రేటర్ విశాఖ, స్మార్ట్ సిటీ అని, రోడ్లన్నీ గతుకులుగా తయారయ్యాయని అన్నారు. వర్షాలకు రోడ్లపైనే మురుగునీరు పారుతోందని, పెద్ద ఎత్తున ఇళ్లు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ఈ అధ్యయన యాత్ర వల్ల విశాఖ ప్రజలకు మేలు జరగకపోగా అనేక భారాలు మోపబడుతున్నాయన్నారు. పౌర సేవలను ప్రైవేటీకరించడానికేనా ఈ యాత్రలని ప్రశ్నించారు. ఇప్పటికే విలువ ఆధారిత పన్నులు భారీగా పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని, ఆ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కొండవాలు ప్రాంతాలు, మురికివాడల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కనీస సౌకర్యాలు వారికి కరువయ్యాయని తెలిపారు. యాత్రల పేరిట ఖర్చు చేస్తున్న నిధులను ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగించాలని కోరారు. జివిఎంసి రిఫరల్ ఆసుపత్రులలో సిబ్బందికి జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, వారికి సకాలంలో జీతాలు చెల్లించి ప్రజల ఆరోగ్యాలు కాపాడవచ్చునని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం నిధులను దుర్వినియోగం చేసిందని, ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి నిధులను ప్రజల అభివృద్ధి కోసమే వినియోగిస్తామని హామీ ఇచ్చాయని తెలిపారు. ఇప్పుడు వైసిపి బాటలోనే టిడిపి కూటమి కూడా ఈ యాత్రలకు అనుమతించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు వెంటనే జోక్యం చేసుకొని ఈ యాత్రను నిలువరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ఎనిమిది రోజులు జరిగే టూర్‌ను తాను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. 2022, 2023ల్లో కూడా ఢిల్లీ, సిమ్లా, కులుమనాలి, చండీఘర్, శ్రీనగర్, అమృతసర్, జమ్మూ కాశ్మీర్, ఆగ్రా వంటి నగరాల్లో రూ.కోట్లతో అధ్యయన యాత్రలు నిర్వహించారని, ఇప్పటికీ అధ్యయన రిపోర్టులుపైగానీ, అధ్యయనం చేసిన అంశాలపైగానీ చర్చ లేదన్నారు. అప్పుడు కూడా అధ్యయనం పేర విహార యాత్రలు చేశారన్నారు. ప్రజల పన్ను ఆదాయాలను బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులు విహార యాత్రలకు ఖర్చు చేయడాన్ని ప్రజలు హర్షించరన్నారు. ప్రజలకు ఏమాత్రమూ ఉపయోగపడని ఈ టూర్‌ను కౌన్సిల్‌లో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు బహిష్కరించాలని, ఈ టూర్‌ను ప్రజలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.

అవినీతి ఆరోపణలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విజయవాడ వరదల సమయంలో చేసిన ఖర్చుల్లో అవినీతి తారా స్థాయిలో జరిగినట్లు తెలుస్తోందని, ఈ నేపథ్యంలో ఆ అవినీతిపై విచారణ జరపాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వరద పరిహారాలు ఇచ్చేటపుడు బాధిత కుటుంబాల సంఖ్య వేలల్లో చూపించారని, అదే వరదల సందర్భంగా చేసినట్లు ప్రభుత్వం చెప్పిన ఖర్చుల ప్రకారం బాధిత కుటుంబాల సంఖ్యను లక్షల్లో చూపించారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారాన్ని కేవలం లక్షలోపు కుటుంబాలకు అందిస్తే, వరద సందర్భంగా కోటి మంది బాధితులకు భోజనాలు పెట్టామని, రూ.368 కోట్లు ఖర్చు అయ్యిందని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఆ లెక్కలన్నీ పొంతన లేకుండా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వై.కొండయ్య, రైటర్స్ అకాడమీ చైర్మన్ వివి.రమణమూర్తి, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ ఈసర లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.793/2024

Between:
Sri Ommi Venkata Prasanth ...Plaintiff
And:
Sri Gonthina Kaveeswara Rao ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Gonthina Kaveeswara Rao,
S/o. G. Adinarayana, Hindu,
aged 43 years,
Welding Institute Business,
R/at Veduruparthi Village,
Kasimkota Mandal,
Anakapalle District-531033.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **06-11-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **06-11-2024 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
N.P. RAJU
Advocate for plaintiff
Visakhapatnam

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.792/2024

Between:
Sri Buradapati Jagadeesh ...Plaintiff
And:
Sri Gonthina Kaveeswara Rao ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Gonthina Kaveeswara Rao,
S/o. G. Adinarayana,
Hindu, aged 43 years,
Welding Institute Business,
R/at Veduruparthi Village,
Kasimkota Mandal,
Anakapalle District-531033.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **06-11-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **06-11-2024 at 10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
N.P. RAJU
Advocate for plaintiff
Visakhapatnam

మహారాజశ్రీ నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
H.M.O.P.No. 49/2024

ఇనపసప్పల సూరిబాబు ... పిటిషనర్
Vs
ఇనపసప్పల నాగ సుకేంద్ర ... రెస్పాండెంటు

నోటీసు

టు:
రెస్పాండెంటు: ఇనపసప్పల నాగ సుకేంద్ర,
భర్త సూరిబాబు, టీచర్,
ప్రసన్నాంజనేయ నగర్, దుర్గమ్మ గుడి వెనక,
సామర్లకోట, కాకినాడ జిల్లా.

మీ పై ఇందలి పిటిషనరు దాఖలు చేసిన పై నెంబరు విడాకుల కేసు తే:07-11-2024 దీకి మీ appearance నిమిత్తము వాయిదా వేసి యున్నారు. సదరు **తే:07-11-2024దీని ఉదయం 10 గంటల 30 నిమిషాలకు** పై కోర్టులో స్వయంగా గానీ ప్లీడరుగారి ద్వారా గానీ హాజరుకావలెను. లేనిచో విమ్ములను పిలిచి exparte చేసి మీ పరోక్ష మందు సదరు విడాకుల కేసు తీర్మానించబడును.

By order of the Court
పొక్కునూరి నరసింహం
పిటిషనర్ తరుపున అడ్వకేట్
నర్సీపట్నం, అనకాపల్లి జిల్లా
నర్సీపట్నం
సెల్: 9440857567
తే:14-10-24

SUIT SUMMONS
AS PER THE ORDERS OF THE HONOURABLE COURT IN I.A.No. 584/2024, Dated 03-10-2024 IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLE
O.S.No. 27/2023

Between:
The Federal Bank Limited, Anakapalle ... Plaintiff
And:
S.Leela Jagadeesh Kumar and Others ... Defendants

To,
1st Defendant:
Sri Siyyadri Leela Jagadeesh Kumar, S/o. Joginaidu, Hindu, aged 43 years, residing in House No. 12-5-47, Flat No.F1, Subhramanya Residency, New Colony, Behind SR Residency, Anakapalle, Anakapalle District.
2nd Defendant: Smt. Siyyadri Rupa, W/o. Leela Jagadeesh Kumar, Hindu, aged 38 years, residing in House No. 12-5-47, Flat No.F1, Subhramanya Residency, New Colony, Behind SR Residency, Anakapalle, Anakapalle District.

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా, వాది బ్యాంకు వారు దావాలో నుదహరించిన బాకీ సొమ్ము మీ వద్ద నుండి రాబట్టి కోరి మీపై దావా వేయగా, సదరు దావాలో కోర్టు వారు ఎన్నిసార్లు మీకు సమన్లు జారీ చేసిననూ, మీరు ఎదో విధముగా తీసుకొనకపోవుటచే మీకు ఈపేపరు నోటీసు ద్వారా తెలియజేస్తూ, మీకు సమన్లు జారీ చేయడమయినది. కావున సదరు దావా **తేది: 07-11-2024**కి వాయిదా అయివున్నందున, సదరు **తేదీని పగలు 10-30 ని॥లకు** పై కోర్టులో హాజరుఅయి మీ యొక్క అభ్యంతరములను మీరు గాని మీ తరపున వకీలుగాని తెలియజేసు కొనవలయును. లేనియెడల మీ పరోక్షమున వాది తరపున తీర్పుజెప్పడమగునని తెలియజేయ డమయినది.

వేణుగోపాలరావు కె.వి.వి.
వాది తరపు న్యాయవాది,
అనకాపల్లి.
అనకాపల్లి.
తే:14-10-24
సెల్: 9949454988

మహారాజశ్రీ నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియరు డివిజను) వారి కోర్టులో
O.S.NO:28 /2023

మధ్యన:
1.కణితి రవితేజ ...వాదులు
మరియు :
1. మోటూరు వర లక్ష్మి
మరియు కొందరు ...ప్రతివాదులు
టు.
3వ ప్రతివాది: మోటూరు హరిత
D/o లేట్ అప్పలరాజు, హిందూ, వయస్సు 38సంవత్సరాలు, డోర్ నెం: 11-7-28, సింహగిరి కాలనీ, గాజువాక, విశాఖపట్నం
6వ ప్రతివాది : కందుల చిన్ని కృష్ణ
S/o అప్పలరాజు, హిందూ, వయస్సు 50 సంవత్సరాలు, డోర్ నెం : 23-19-7, B.C. రోడ్డు, సీతా రామ కాలనీ, న్యూ గాజువాక, విశాఖపట్నం.

జనరలు నోటీసు

యింధలి వాది వాది స్పెసిఫిక్ పెర్ఫార్మన్స్ కాంట్రాక్ (Specific performance of contract) కోరుచూ పై కోర్టులో పై నెంబరు దావా ధాఖలు చేసినందున, 3 మరియు 6వ ప్రతివాదులకు యెన్ని సార్లు దావా సమన్లు పంపిననను తీసుకోనందున శ్రీ కోర్టు వారు పేపర్ పబ్లికేషనుద్వారా నోటీను పంపమని ఆధేశించినందున ఈ పేపర్ ద్వారా మీకు నోటిసు పంపడమయినది సదరు విషయములో మీకు ఎట్టి ఆక్షేపణలు యున్నాను **తేది. 29-10-2024 ఉదయము 10-30 గంటలకు** పై కోర్టు వారి యెదుట స్వయముగా కాని అడ్వొకేటు ద్వారా కాని హాజరై తమకు గల ఆక్షేపణలు తెలియపర్చవలేను లేనిచో సధరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మానము చేయూదురు అని ఈ నోటీసు మూలంగా తెలియపర్చుడమైనీది.

గొలుసు శంకర రావు
వాది తరుపున న్యాయవాది
నర్సిపట్నం. సెల్ నెం : **9440403999.**
తేది. 14-10-2024

చెస్ట్ పెయిన్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్ సిటీలోని అపోలో ఆసుపత్రిలో చెస్ట్ పెయిన్ క్లినిక్‌ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో యువత గుండెపోటు బారిన పడుతున్నారన్నారు. గుండె సంబంధిత సమస్యలు వస్తే ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్డియాక్ మరణాలను నివారించడానికి ఇటువంటి క్లినిక్‌లు చాలా అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా అపోలో సేవలు విస్తరించాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంచే విధంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు చెయ్యాలని మంత్రి కోరగా, అపోలో యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. అపోలో హాస్పిటల్స్ రీజనల్ సిఇఒ వై.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఛాతీ నొప్పి క్లినిక్ సేవలు రామన్‌నగర్, హెల్త్ సిటీలోని అపోలో ఆసుపత్రిలో అందుబాటులో ఉందన్నారు. గుండె సంబంధిత నొప్పిని త్వరగా గుర్తించి కార్డియాక్ మరణాలను నివారించడానికి ఈ క్లినిక్‌లను ప్రారంభించామన్నారు. అత్యవసర రోగుల కోసం పది కిలోమీటర్ల పరిధిలో పికప్ సర్వీసులు ఉచితంగా అందించనున్నామని తెలిపారు. అపోలో చెస్ట్ పెయిన్ క్లినిక్‌లో నిర్ణీత వ్యవధిలో గుండె పోటు రోగులకు చికిత్స చేసేందుకు 24 గంటలూ నిపుణులు అందుబాటులో ఉంటారని చెప్పారు. డాక్టర్ బారువా మాట్లాడుతూ, ఛాతి నొప్పితో బాధపడుతున్న రోగిని అత్యవసర బృందం పరీక్షించి గుండె సంబంధమా, ఇతర కారణాల వల్ల వచ్చిందా అనేది నిర్ధారిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో సిఒఒ రామచంద్ర, సీనియర్ కార్డియాలజిస్టులు డాక్టర్ ఎన్‌కె శశాంక చందూరి తదితరులు పాల్గొన్నారు.

ఛాతి నొప్పి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి వంగలపూడి అనిత, అపోలో రీజనల్ సిఇఒ సుబ్రహ్మణ్యం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : షార్ట్ సర్క్యూట్ కారణంగా జివిఎంసి మూడో వార్డు కృష్ణాకాలనీకి చెందిన వియ్యపు తౌడు పాన్ షాప్ ఇటీవల దగ్ధమైన నేపథ్యంలో బాధిత కుటుంబానికి స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కుమారుడు టిడిపి యువ నేత గంటా రవి తేజ సోమవారం రూ.10 వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్, టిడిపి వార్డు అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, పార్టీ నాయకులు ఎన్.వెంకటరావు, కనకల అప్పలనాయుడు, ఆవాల సూరిబాబు, కె.రామస్వామి పాల్గొన్నారు.

శారదా పీఠం వ్యవహారాలపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : చిన ముషిడివాడ శారదా పీఠాధిపతి అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేయాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత వైసిపి ప్రభుత్వం రూ.కోట్ల విలువ చేసే జివిఎంసి మూడో వార్డు పరిధిలో ఉన్న కొండపై ఏకంగా 15 ఎకరాల భూమిని పీఠాధిపతి స్వరూపానందేంద్రకు కట్టబెట్టిందని విమర్శించారు. సంబంధిత భూమిని వెనక్కి తీసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు చెప్పారు. విశాఖను రాజధానిగా ప్రకటిస్తూ గత వైసిపి పెద్దలు విశాఖలోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను కాజేశారని ఆరోపించారు. వీటిపై కూడా సమగ్ర దర్యాప్తు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, జిల్లా కార్యదర్శి బోడేపూడి దొరబాబు, డాక్టర్ పపూర్ నికుంజ్, గండిబోయిన పోలిరాజు పాల్గొన్నారు.

బాలికకు దాతల సాయం

ప్రజాశక్తి -భీమునిపట్నం : తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జివిఎంసి మూడో వార్డు బోయివీధికి చెందిన బాలిక ఎం.రాణికి మెరుగైన వైద్యం నిమిత్తం ఎంపిపి డివిఎస్ఎస్ఎన్.రాజు, ఎన్.రవికుమార్ రూ.24 వేలు సాయం చేశారు. ఈ మొత్తాన్ని స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు గంటా నూకరాజుతో పాటు బాలిక తండ్రి శ్రీను కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు కె.నాగరాజు, ఎం.సంజీవకుమార్, ఆర్.రమణ, గండిబోయిన పోలిరాజు పాల్గొన్నారు.

మధురవాడలో శ్రీ టెక్ ఐటి కంపెనీ ప్రారంభం

శ్రీటెక్ ఐటి కంపెనీ ప్రారంభంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి మారికవలస వద్ద హరి తోట ఏర్పాటుచేసిన శ్రీటెక్ ఐటి కంపెనీని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటి ఉద్యోగి నిరంతరం తన ప్రతభను పెంపొందించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఐటి టెక్‌లో మంచి మార్పులు వస్తాన్నాయన్నారు. రానున్న రోజుల్లో విశాఖ మంచి ఐటి హాబ్‌గా మారనున్నట్లు తెలిపారు. ఐటి మంత్రి నారా లోకేష్ కృషితో టిసిఎస్ కంపెనీ ద్వారా 10 వేలు ఉద్యోగాలు వస్తున్నాయని తెలిపారు. అనంతరం భీమిలి, పాలకొండ, గాజువాక ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, నిమ్మక జయకృష్ణ, పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఐటి ఉద్యోగులు నిత్య విద్యార్థులుగా తన ప్రతిభను పెంపొందించుకోవాలన్నారు.

శ్రీ టెక్ సిఇఒ హరి తోట మాట్లాడుతూ, తమ సంస్థ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, భీమిలి జనసేన ఇంచార్జ్ సందీప్ పంచకర్ల పాల్గొన్నారు.

బోనిలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -ఆనందపురం : బోని గ్రామ పంచాయతీలో సోమవారం పంచాయతీ కార్యదర్శి దుర్గ, గ్రామ సర్పంచ్ బోని అప్పలకొండ ఆధ్వర్యాన పారిశుధ్య పనులు చేపట్టారు. 'బోనిలో అపారిశుధ్యం' శీర్షికన ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టి బ్లీచింగ్ చల్లారు. గ్రామంలో ఉన్న మరుగుదొడ్ల వద్ద బ్లీచింగ్ చల్లారు. బోనీ పంచాయతీ రామినేనిపేట గ్రామం నుంచి పంట పొలాల వైపు వెళ్లే మురుగు నీరు నిల్వ చేరి అపారిశుధ్యం వ్యాపించడంతో నివారణ చర్యలు చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి తెలిపారు. గ్రామం నుంచి మురుగు నీరు పోయే కాలువ శుభ్రం చేసి నివారణ చర్యలు చేపడతామన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టిన గ్రామ కార్యదర్శి దుర్గ

అగనంపూడిలో అంబేద్కర్ విగ్రహావిష్కరణ



అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -ఉక్కునగరం : జివిఎంసి 85వ వార్డు పరిధి అగనంపూడి కొండయ్యవలసలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాలనీలో మహాత్మా జ్యోతీరావుపూలే అంబేద్కర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు సంఘం సభ్యులు వినతిపత్రం అందించారు. సంఘం నాయకులు కె.పరంధామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, బొండా జగన్, ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, ఎన్.రామారావు, విళ్లా రామ్మోహన్‌కుమార్, దళిత నాయకులు పాల్తేటి పెంటారావు, బూసి వెంకటరావు, బత్తుల శ్రీనివాసరావు, కుటమి నాయకులు, అంబేద్కర్ కాలనీ సంఘ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

లారస్ బస్సు ఢీకొని బైకిస్టు దుర్మరణం

ప్రజాశక్తి- కె.కోటపాడు : ద్విచక్ర వాహనాన్ని లారస్ కంపెనీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బైకిస్టు దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని గుల్లేపల్లి గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. కె.కోటపాడు పోలీసులు అందించిన వివరాలు ప్రకారం... మండలంలోని గుండుపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి ఈశ్వరరావు (45) చోడవరం మండలం రాయపురాజుపేట నుండి స్వగ్రామం గుండుపాలెంకు మోటర్ బైక్‌పై సోమవారం వస్తున్నారు. గుల్లేపల్లి గ్రామం దుర్గాలమ్మ గుడి సమీపంలోకి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న లారస్ కంపెనీ బస్సు ఈశ్వరరావు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వస్తున్న ఈశ్వరరావు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆర్.ధనుంజయ విలేకరులకు తెలిపారు.

ఆటోనగర్‌లో గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

రహదారుల గుంతలు పూడ్చివేత

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్ రహదారులపై ఉన్న గుంతలను సోమవారం పూడ్చారు. 'అధ్వానంగా ఆటోనగర్ రహదారులు' శీర్షికన ప్రజాశక్తిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రహదారులపై ఉన్న గుంతల్లో తాత్కాలికంగా పూడ్చివేత పనులు చేపట్టారు.

డిసిపి-2 మేరీ ప్రశాంతి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక పోలీస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లో డిసిపి-2గా మేరీ ప్రశాంతి బాధ్యతలు స్వీకరించారు. గతంలో అనకాపల్లి జిల్లాలో పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమెకు పలువురు అధికారులు స్వాగతం పలుకుతూ, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఆమెను కలిసిన వారిలో సౌత్ ఎసిపి త్రినాథ్, గాజువాక ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

నవోదయలో 9, 11 తరగతులకు దరఖాస్తులు

ప్రజాశక్తి -మధురవాడ : జవహర్ నవోదయ విద్యాలయ కొమ్మాదిలో 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11 తరగతుల ప్రవేశ పరీక్షకు నవోదయ విద్యాలయ సమితి నోటిఫికేషన్ విడుదల చేసిందని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికి 2024-25 విద్యాసంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, 11వ తరగతికి దరఖాస్తు చేసుకోవటానికి 2024-25 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో నివాస ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని పేర్కొన్నారు. 2024 - 25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలు అర్హులని తెలిపారు. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2010 మే 1 నుంచి 2012 జులై 31 మధ్య జన్మించి ఉండాలని, ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2008 జూన్ 1 నుంచి 2010 జులై 31 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 2025 ఫిబ్రవరి 8వ తేదీన పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో 9వ తరగతి https://cbseitms.nic.in/2024/nvsix, 11వ తరగతి విద్యార్థులు https://cbseitms.nic.in/2024/nvsxi_11 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఎన్ఎస్ఆర్ఐటిలో వర్క్‌షాప్

ప్రజాశక్తి-ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అధ్యాపకులకు అటానమస్ వర్క్‌షాప్‌పై అవగాహన కల్పించారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ సిఎస్ఇ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.విశ్వనాథ్‌రాజ్ హాజరై మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్‌బిఎ అక్రిడేషన్ ప్రాసెస్‌లో అసైన్మెంట్, ఎవిలేషన్ ప్రక్రియలపై జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రోగ్రాం ఫలితాలను గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ చెంబుప్రసాద్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలు బోధనలో మెళకువలు తెలుసుకోవడానికి దోహదపడుతుందన్నారు.

రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న గీతం ప్రతినిధులు

రతన్ టాటాకు గీతం ఘన నివాళి

ప్రజాశక్తి- మధురవాడ : ప్రముఖ పారిశ్రామిక వేత్త, టాటా గ్రూప్ సంస్థల చైర్మన్ రతన్ టాటాకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం నివాళులర్పించింది. గీతం ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అధ్యక్షతన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక అభివృద్ధిలో, ఉపాధి కల్పనలో టాటా సంస్థల పాత్ర విడదీయలేనిదన్నారు. ప్రజలను ప్రభావితం చేసే ప్రతి రంగంలోను రతన్ టాటా నేతృత్వంలోని టాటా గ్రూప్ సంస్థలు ఎంతో నిబద్ధత, విలువలతో పనిచేయడం మరవలేనిదని పేర్కొన్నారు. గీతం విశ్వవిద్యాలయానికి టాటా గ్రూప్ సంస్థలకు ముఖ్యంగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు అవినాభావ సంబంధం ఉందన్నారు. దాదాపు 10 వేల మంది గీతం పూర్వ విద్యార్థులు టిసిఎస్‌లో వివిధ స్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు. గీతం, టిసిఎస్ మధ్య అవగాహన ఒప్పందాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. దేశ ప్రగతికోసం రతన్ టాటా అంకిత భావంతో చేసిన కృషి నేటి తరం యువతకు మార్గదర్శకం కావాలన్నారు.

గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ కెవి.ఉమాదేవి మాట్లాడుతూ, రతన్ టాటా ఎంతో నిబద్ధత, సమాజం పట్ల బాధ్యత గల పారిశ్రామిక వేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్ప, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, విశాఖ జిసిజిసి డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజులు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.రవికిరణ్, వివిధ విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

'సాంస్కృతిక విప్లవానికి ప్రతీక బౌద్ధ ధర్మం'

ప్రజాశక్తి-సీతమ్మధార : సాంస్కృతిక విప్లవానికి ప్రతీకగా బౌద్ధ ధర్మం నిలుస్తోందని పలు సంఘాల నేతలు పేర్కొన్నారు. నగరంలోని రామా టాకీస్ సమీపంలోని అంబేద్కర్ భవన్ బౌద్ధ విహార్‌లో అశోకుని బౌద్ధ విజయదశమి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్, రమాబాయి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుద్ధవిహార్‌లో బుద్ధుని విగ్రహం వద్ద కొవ్వొత్తుల వెలిగించి బుద్ధ వందనం చేశారు. ఈ సందర్భంగా ఉద్దండ్రాజవరం బౌద్ధ ధర్మ పీఠానికి చెందిన భంతే అనాలయో బౌద్ధ సందేశాన్ని ఇచ్చారు. ప్రపంచ మానవాళి శాంతి, సామరస్యం, సౌభాగ్యాలకు బౌద్ధ ధర్మమే శరణ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ బుద్ధ విహార్ కన్వీనర్ బత్తుల గౌతంబాబు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, ప్రతిఘాత విప్లవంతో బౌద్ధం భారతదేశంలో బలహీన పడినప్పటికీ ఖండాంతరాలు వ్యాపించిందని తెలిపారు. నేడు సుమారు 120 దేశాలలో తన ఉనికిని చాటుతూ బౌద్ధం ప్రాచుర్యం పొందిందని పేర్కొన్నారు. బౌద్ధ జీవన విధానం మతాలకతీతంగా పరిగణించాలని మానవహక్కులు, నైతికత, శాస్త్రీయ దృక్పథం ఆ బోధనలలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ కోశాధికారి గార సత్యనారాయణ, కర్రి సత్యనారాయణ, గొంది నవీన్, డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, ఎమ్.మల్లయ్యరాజు, బీర రత్నకుమారి, ధర్మారావు, సిద్ధార్థ, యువి. రావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా సింధియా బ్రాంచి ప్రారంభం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బ్యాంక్ ఆఫ్ బరోడా విశాఖపట్నం రీజియన్ పరిధిలో 44వ శాఖను సింధియా జంక్షన్‌లో నావెల్ డాక్ యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసన్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేవీ ఐఎన్ఎస్ రీజనల్ మేనేజర్ రఘురామన్ చక్రవర్తి, బ్యాంక్ మేనేజర్ పి.ఎం.ప్రధాన్, డిఆర్ఎం సతీష్ సోలంకే, బ్రాంచ్ మేనేజర్ సాయిబాబు, నగరంలోని ఇతర బ్రాంచ్ మేనేజర్లు, ఆఫీస్ సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచి ప్రారంభంలో శ్రీనివాసన్ తదితరులు

పల్లె పండగ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-యంత్రాంగం

భీమునిపట్నం : 'పల్లె పండగ' వారోత్సవాల్లో భాగంగా భీమిలి మండలం, ఆర్.తాళ్లవలస పంచాయతీ గొల్లల తాళ్లవలసలో ఎంఎన్ఆర్ఇజిఎస్ నిధులు రూ.30 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం లాంఛనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి గాడు వెంకటప్పడు, తాళ్లవలస ఎంపిటిసి కోరాడ రమణ, ఎండిఒ ఎన్.హనుమంతరావు, ఎంఎన్ఆర్ఇజిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ఆంజనేయులు, ఎపిఒ జివిఎస్.గౌరి, టెక్నికల్ అసిస్టెంట్ జి.అత్యుత్, ఇఒపిఆర్డి కనకల రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి : మండలం ఎస్ఆర్.పురం, ముదపాక, రాంపురం, పినగాడి, గుర్రంపాలెం, జుత్తాడ గ్రామాల్లో పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దూది విజయలక్ష్మి మడక అప్పలరాజు, జనసేన మండల అధ్యక్షులు రాముునాయుడు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని అనంతవరం, పెంట గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం భూమి పూజ చేస్తారని ఎంపిడిఒ విజయకుమార్ తెలిపారు.

కోటవురట్ల : మండలంలోని కోటవురట్ల, తంగేడు, కైలాసపట్నం, గ్రామాలలో సోమవారం పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. ఎపిఒ నాగరాజు ఆధ్వర్యంలో తాహసిల్దార్ తిరుమల బాబు, ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు కాలువలు నిర్మాణానికి 80 వర్కులు గుర్తించగా రూ. కోటి 8 లక్షలు ఖర్చు చేసేందుకు అంచనాలు రూపొందించారు. 31 గోకులం షెడ్ల నిర్మాణం, 160 ఎకరాలలో హార్టీ కల్చర్ ద్వారా జీడి, మామిడి, కొబ్బరి, నిమ్మ, ఆయిల్ ఫామ్, డ్రాగన్ ఫ్రూట్ వంటి పంటల సాగుకు ఎకరాకు రూ.1.20 లక్షలు ఖర్చు చేసేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపిటిసి సూర్యారావు, రాంబాబు, డిఇఇ కుమార్ రాజు, పిఆర్ జెఇఇ వర్మ పాల్గొన్నారు.

నాతవరం : మండలంలో పి.జగ్గంపేట, పీకే గూడెం, గునుపూడి, ఎస్ బి పట్నం చినగొలుగొండపేట గ్రామాల్లో పల్లె పండుగలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మాజీ జెడ్పిటిసి కరక సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ. మాజీ ఎంపిపిలు పారుపల్లి కొండబాబు, నేతల విజయ్ కుమార్ పాల్గొన్నారు

కె.కోటపాడు : పల్లె పండుగ వారోత్సవాల సందర్భంగా సోమవారం మండలంలోని సింగన్నదొరపాలెంలో రూ.50లక్షలతోనూ, కేజే పురంలో రూ.19.85 లక్షలు, ఏ కోడూరులో రూ.45.05 లక్షలు, ఆర్పై అగ్రహారంలో రూ.21.85 లక్షలు, పోతన వలసలో రూ.20 లక్షలు, కొరువాడలో రూ.5 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్లకు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పిడి పూర్ణిమ దేవి, టిడిపి నాయకులు పైలా ప్రసాదరావు, రొంగలి మహేష్, ఎంపీడీవో సాంబశివరావు, డిప్యూటీ తహశీల్దారు రమేష్ బాబు, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

అనకాపల్లి : పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రామాపురంలో రూ.62 లక్షలు, దేవినగర్‌లో 25 లక్షలు, ఎస్సీ కాలనీలో రూ.5 లక్షలు, సత్యనారాయణపురం, మూలపేటలో రూ.30 లక్షల చొప్పున, సాయి నగర్‌లో 20 లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం సర్పంచులు పలక భాగ్యలక్ష్మి, సర్పంచ్ లక్ష్మీప్రసన్న, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కర్రి బాబి పాల్గొన్నారు.

నాతవరం మండలంలోని గ్రామాల్లో....

కోటవురట్ల మండలంలో...

అనకాపల్లి మండలంలో...

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని, సొంత నిధులతో అభివృద్ధి చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను ఎఐటియుసి నాయకులు మసేన్, హెచ్ఎంఎస్ నాయకులు మంగ నాయుడు, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టియుసి నాయకులు చందు, సిఎఫ్‌టియు నాయకులు మూర్తి, బిఎంఎస్ నాయకులు రవిశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల కష్టంతో పోర్టుకు రూ.వేలకోట్ల లాభాలు వచ్చాయన్నారు. ఈ సంవత్సరం రూ.786 కోట్లు లాభం వచ్చిందని, ప్రభుత్వానికి రూ.171.42 కోట్లు పన్నులు కట్టారని తెలిపారు. పోర్టు ఏర్పడిన 50 ఏళ్ల తర్వాత అప్పటికి వచ్చిన లాభాలతో గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ ఏర్పడిందన్నారు. ప్రస్తుతం హాస్పిటల్‌ను నడపడానికి 100 సంవత్సరాలకు సరిపోయే రిజర్వ్ ఫండ్స్ పోర్టు దగ్గర ఉన్నాయని, అయినా ప్రయివేటు వారికి ఇవ్వాలన్న బిజెపి విధానం చాలా దుర్మార్గమైనదని అన్నారు. ప్రజా పోరాటంగా మలిచి హాస్పిటల్‌ను రక్షించుకుంటామన్నారు. రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన దీక్షలో నాయకులు శంకరరావు, నాయుడు, రాఘవులు, రమణ, ట్రస్టు మెంబర్లు పోతన్న, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న అఖిలపక్ష కార్మిక సంఘం నాయకులు

వడ్లపూడి రహదారి అభివృద్ధికి వినతి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 87వ వార్డు పరిధి వడ్లపూడి ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని గాజువాక జోనల్ కమిషనర్‌కు స్థానిక వైసిపి నాయకులు బి.గోవిందు, చిత్రాడ వెంకటరమణ సోమవారం వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో ఉన్న అన్ని రహదారులు గుంతలమయంగా ఉన్నాయని, తక్షణమే కొత్త నిర్మాణాలు కానీ, మరమ్మతులు కానీ చేపట్టాలని చేపట్టాలని కోరారు.

జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

వంటనూనె ధరలు తగ్గించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార: భారీగా పెంచిన వంటనూనె ధరలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అక్కయ్యపాలెం నరసింహారావు రైతు బజార్ వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ, నిత్యవసర వస్తువులు, కాయగూరల ధరలు భారీగా పెరగడంతో ప్రజలకు ఆహార భద్రత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. భారీగా పెంచిన వంటనూనె, వంటగ్యాసు, నిత్యవసర వస్తువుల ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజల పక్షం అని చెప్పడం, తర్వాత సొంత వ్యాపారాలు చేసుకోవడం రాజకీయనాయకులకు పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రజలు, కార్మికుల సమస్యలపై పనిచేసే ప్రజాప్రతినిధులు కరువైన నేటి పరిస్థితుల్లో ప్రజలే తమ సమస్యల పరిష్కారానికి ఎర్రజెండా ప్రజా ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రావి కృష్ణ, చిల్లర సంఘం నాయకులు జి.శ్రీనివాసరావు, పి.సాయికుమార్, వెంకటరాయుడు, ఎం.రాము తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై హెల్త్ సెక్రటరీల ధర్నాలు

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలను డిడిఒ అధికారాలతో పూర్తిస్థాయిలో వైద్య ఆరోగ్య శాఖలోకి బదలాయించాలని కోరుతూ ఎపి యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.జగన్మోహన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిడిఒ అధికారాలతో సహా మొత్తం గ్రామ, వార్డు సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖలోకి బదలాయించాలన్నారు. సీనియారిటీ లిస్టులు తయారు చేసి, ఎంపిహెచ్ (ఎఫ్)గా ఉద్యోగోన్నతులు కల్పించాలని, పైరవీలకు అవకాశం ఇవ్వకూడదని కోరారు. అలాగే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న హెల్ సెక్రటరీలకు ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. డేట్ ఆఫ్ డెలివరీతో సంబంధం లేకుండా అప్లై చేసిన రోజు నుండి మెటర్నిటీ లీవ్ వర్తించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సరెండర్ లీవులు, యూనిఫామ్ అలవెన్స్, ఇంక్రిమెంట్లు, చైల్డ్ కేర్ లీవ్‌లు, ఎర్నీడ్ లీవ్స్, అడాప్షన్ లీవ్స్, ఎవిడి ఛార్జీలు చట్ట ప్రకారం అమలు చేయాలని కోరారు. ఇంటెన్సిఫైడ్ జిఎన్ఎమ్ ట్రైనింగ్ అయిన హెల్త్ సెక్రటరీలకు 115 జిఒను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కార్యదర్శి బి.జగన్, ఎపి యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షురాలు పి.మణి, జిల్లా అధ్యక్షురాలు ఎస్.సుభాషిణి, జిల్లా నాయకులు కల్యాణి, రాజ్యలక్ష్మి, జాయ్, సంతోషి, భాగ్యలక్ష్మి, జగదీశ్వరి, ప్రమీల, జగ్గమ్మ, పైడితల్లి, లావణ్య కుమారి, నిర్మలా కుమారి పాల్గొన్నారు.

అనకాపల్లి : గ్రామ,వార్డు సచివాలయం హెల్త్ సెక్రటరీలను పూర్తి స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకురావాలని, ఎంపిహెచ్ఎ (ఎఫ్)లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ వద్ద ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. అనంతరం డిఎం అండ్ హెచ్ఒ, జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆళ్ళ దేవకి మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలు మున్సిపల్ కమిషనర్లు/ఎంపిడిఓలు, డిఎం అండ్ హెచ్ఒ పరిధిల్లో పనిచేయడం వలన, వీరంతా ఒకే సమయంలో వేరు వేరు పనులు అప్పగించడం వలన గత మూడు సంవత్సరాలు తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని సరిచేయమని, వివిధ శాఖల మధ్య సమన్వయం జరిగేలా తగు ఆదేశాలు జారీ చేయాలని, మొత్తం సిబ్బందిని వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో తీసుకురావాలని ఎంత మొత్తుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకొని పూర్తిస్థాయి వైద్యారోగ్య శాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. వీరి నిరసనకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, కోశాధికారి వివి శ్రీనివాసరావు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రత్నం, లక్ష్మి, సూరి కళ పాల్గొన్నారు.

అనకాపల్లి ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని కోరుతూ సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్వర్యాన సోమవారం స్థానిక మెయిన్ రోడ్లో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగ భూషణం మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల్లో ఉన్న తెలుగు విశ్వ విద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ గత నెల 20న తెలంగాణా రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయిడు తక్షణమే దీనిపై స్పందించిపొట్టి శ్రీరాములు పేరును కొనసాగించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల క్రిష్ణ మోహన్, రొబ్బి మల్లే మల్లేశ్వరరావు, సోమరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ విధానంలో డిఎస్‌సి శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చుటకు శిక్షణ సంస్థల నమోదుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారికత అధికారి కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా 5050 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్షియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చుటకు నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ శిక్షణ రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ సంస్థలు, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్ నందు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎంపానల్మెంటు కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణ సంస్థలు కనీసం గత రెండు డిఎస్సి రిక్రూట్మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలని, గత డిఎస్సి రిక్రూట్మెంట్‌లో కనీసం వంద మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలని, మూడు సంవత్సరాలు సరాసరి టర్నోవర్ రూ.40 లక్షలు ఉండాలని కోరారు. ఆసక్తి ఉన్న శిక్షణ సంస్థలు ఇతర వివరాల కోసం డాక్యుమెంట్‌ను AP E-procurement నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చునని, ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

16 నుండి నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : ఈనెల 16 నుంచి 31 వరకు గొర్రెలు మేకలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బి రామ్మోహన్రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న మూడు లక్షల 42 వేల జీవాలలో నట్టల నివారణకు ఎనిమిది లక్షల 58 వేల 542 రూపాయల నిధులు ఈ కార్యక్రమానికి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అనకాపల్లి జిల్లాలో నియోజకవర్గ స్థాయి పశు వ్యాధి నిర్ధారణ కేంద్రాల సహాయంతో ప్రి డివార్మింగ్ పేడ నమూనాలను పరీక్షించి అవసరమైన నట్టల నివారణ మందులను అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

కెజిబివిల్లో వికలాంగ మహిళలకు అవకాశం పట్ల హర్షం

ప్రజాశక్తి -అనకాపల్లి : కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో నాన్ టీచింగ్ పోస్టుల్లో వికలాంగ మహిళలకు అవకాశం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రపల్లి వీరు యాదవ్ పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, ఆయా, నైట్ వాచ్ ఉమెన్, పలు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలకు తమ తమ మండలాల్లో ఉన్న ఎంఇఓ కార్యాలయంలో ఈ నెల 15న మంగళవారం సాయంత్రం వికలాంగ మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి లబ్ధిదారులకు అప్పగించాలి

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన దళితులకు చెందిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని తిరిగి లబ్ధిదారులకు అప్పగించాలని సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ బి. చిన్నికృష్ణకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగారమ్మ పాలెం గ్రామానికి చెందిన దళితులు వంకర అర్జున, వంకర సూర్యనారాయణలకు చెందిన సర్వే నెంబర్ 70/6లో రెండు ఎకరాలు, 70/22లో ఐదు సెంట్లు అసైన్డ్ భూములు ఆ గ్రామానికి చెందిన భూస్వాములు దాడి త్రిమూర్తులు, కన్నం నాయుడు, దాడి అప్పారావు, దాడి సూర్యనారాయణ, దాడి రాంబాబు, కోరిబిల్లి నూకరాజు తదితరులు అక్రమంగా లాక్కున్నారని తెలిపారు. ఆ భూముల్లో వారు సాగు చేయడమే కాకుండా అక్రమ నిర్మాణాలు చేశారని పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ సమగ్ర దర్యాప్తు చేసి తిరిగి బాధిత దళితులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. బాధితుడు వంకర అర్జున మాట్లాడుతూ 1954లో ప్రభుత్వం తన తండ్రి వంకర అమ్మతల్లికి అసైన్డ్ భూములు ఇచ్చినట్లు తెలిపారు. ఆ భూములు వంశపారంపర్యంగా తమకు చెందాలని తహసీల్దార్‌కు విన్నవించారు. భూ రీ సర్వేలో దళితుల భూములను రికార్డులు మార్చారని, వాటిపై దర్యాప్తు చేసి తమ భూములు తిరిగి తమకు అప్పగించాలని కోరారు.

నేవీ మెయిన్ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

రహదారిపై ఉన్న గోతుల వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి-రాంబిల్లి : మండలంలోని నేవీ మెయిన్ రోడ్డుకు మరమ్మతులు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల కన్వీనర్ జి దేవుడు నాయుడు, ఇతర నాయకులతో కలిసి నేవీ మెయిన్ గేట్ నుండి వెంకటాపురం సెంటర్ వరకు మెయిన్ రోడ్డుపై ఉన్న పెద్ద గొయ్యిలను పరిశీలించారు. ఈ రోడ్డులోని పెద్ద గోయ్యిల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ రహదారిలో పెద్ద గోయ్యిలు ఉండడం వల్ల నేవీ నిర్మాణ పనులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఈ గొయ్యిల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నాయని, కాళ్ల చేతులు విరిగిపోవడమే కాకుండా ప్రాణాలు కూడా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేవీ నిర్మాణ పనులకు ప్రతి రోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డుపై దుమ్ము ధూళి లేచిపోయి రాంబిల్లి, గోవింద పాలెం, సంతపాలెం గ్రామాల్లో పంటలు, వ్యాపారాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా నేవీ అధికారులు, జిల్లా ఆర్ అండ్ బి అధికారులు జోక్యం చేసుకొని గుంతలు పూడ్చి, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే రోడ్డుపై భారీ వాహనాలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు వై.రాము, ఆర్.రాంబాబు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

అధికారులకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టరు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000 మంది బాలురు, 978 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండాలని పేర్కొన్నారు. బాలికలను కాపాడుకోవాలని, వారిపై వివక్ష చూపకూడదని తెలిపారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నేరమన్నారు. ఏ లేబరేటరీగాని, స్కానింగ్ కేంద్రంగాని గర్భస్థ పిండం లింగాన్ని తెలిపే ఉద్దేశ్యంతో చేయరాదని ఆమె స్పష్టం చేశారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, పదివేల రూపాయిల జరిమానా విధించడం జరుగుతుందని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ pcpndt.ap.gov.in ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలని ఆమె కోరారు. ఆడపిల్ల విలువ అపారమని, మనమంతా కలిసికట్టుగా లింగ వివక్షతకు చరమగీతం పాడుదామని పేర్కొన్నారు. ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎంఎస్‌వికె బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 73 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా 11 కేంద్రాలు గుర్తింపు కొరకు దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. స్కానింగు కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. బాలికలు సంరక్షణపై ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తహశీల్దార్‌గా చిన్నికృష్ణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : సబ్బవరం మండల తహశీల్దార్‌గా చిన్నికృష్ణ బమ్మిడి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిన్ని కృష్ణ ఎస్ఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏటగా విధులు నిర్వహిస్తూ బదిలీపై సబ్బవరం తహశీల్దార్‌గా వచ్చారు. గతంలో గాజువాక తహశీల్దార్‌గా, విశాఖపట్నం కలెక్టర్ కార్యాలయంలో పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు శక్తివంతన లేకుండా మండలంలోని రెవిన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ బి.చిన్నికృష్ణను సబ్బవరం -4 ఎంపీటీసీ గొర్లె క్రిష్ణ చైతన్య మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొత్తూరు గడ్డప్ప, గొర్లె సత్యనారాయణ, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : మండలంలోని చిన్న అప్పన్నపాలెంలో పైడిమాంబ అమ్మవారి నూతన ఆలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ప్రారంభమయ్యాయి. సాయంత్రం గ్రామంలో తిరువీధి మహోత్సవాలు జరిపారు. గ్రామంలో ప్రతి ఇంటి నుండి చీర, జాకెట్, పసుపు, కుంకుమ, పండ్లు, స్వీట్లు తదితర వాటితో సారెను ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించారు. సర్పంచ్ కోవెల నాగమణి, గ్రామ పెద్దలు కోవెల ఈశ్వరరావు ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేశారు.

రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డిసి, కళాశాల స్కిల్ హబ్ ఆధ్వర్యంలో 16వ తేదీ ఉదయం 9 గంటల నుండి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలో అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్, హెల్త్ కేర్ సంస్థలు పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గంలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ జాబ్ మేళాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వి.అప్పలనాయుడు కోరారు. ఉద్యోగమేళాలో పాల్గొనే విద్యార్థులు వారి బయోడేటా, సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు. వివరాలకు స్కిల్ హబ్ ఇన్చార్జ్ శ్రీనివాస్ 9494791935 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

అరటి తొక్క కథకు ఉత్తమ బహుమతి

ప్రజాశక్తి- కశింకోట : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సింహప్రసాద్ సాహిత్య సమితి నిర్వహణలో మహాకవి శ్రీశ్రీ స్మారక కథల పోటీలో కశింకోటకు చెందిన బొడ్డేడ బలరామస్వామి రాసిన అరటితొక్క కథ ఉత్తమ కథగా ఎంపికైంది. సోమవారం హైదరాబాదు రవీంద్రభారతిలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కెవి.రమణాచారి బొడ్డేడ బలరామస్వామిని శాలువాతో సత్కరించి, నగదు, ప్రశంసాపత్రం, షీల్డ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో తొలి తెలంగాణ బిసి కమీషన్ ఛైర్మన్, ప్రముఖ రచయిత బిఎస్.రాములు, ప్రముఖ రచయితలు విహారి, వాణిశ్రీ, పత్తిపాక మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ చేపల పెంపకందారుల బరితెగింపు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలో అక్రమంగా చేపల చెరువులు నిర్వహిస్తున్న వారు బరితెగించారని, దసరా పండగ నేపథ్యంలో సందిట్లో సడేమియాలాగా మాంసం వ్యర్థాలను చేపలకు మేతగా చెరువుల్లో వేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. మండలంలోని కొత్తపెంట, ములకలాపల్లి, పెదనందిపల్లి, కలిగొట్ల, తారువా, మారేపల్లి, గజపతినగరం, చేనులపాలెం తదితర గ్రామాల్లో సోమవారం వెంకన్న పర్యటించి అక్రమంగా నిర్వహిస్తున్న చేపల చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా పండగ సందర్భంగా కోడి, ఇతర మాంసం వ్యర్థాలు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా దొరకడంతో చేపల పెంపకందార్లు వాటిని ప్రతి చెరువులోనూ వేశారని తెలిపారు. చేపల చెరువుల్లో చేపల మేతకు పశుమాంసం, కోళ్ళు, మేకలు, గొర్రెల మాంసం వ్యర్థాలను, హోటళ్లలో వ్యర్థాలను వేయడం వల్ల, ఆ చేపలు తినేవారికి కేన్సర్ వంటి భయంకరమైన రోగాలు వస్తున్నాయని, ఆ వ్యర్థాలను మేతగా వేయకుండా నిరోధించాలని గతంలో అనేక సార్లు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. అక్రమ చేపల చెరువుల నిర్వాహకులు ఇచ్చే ముడుపులకు లొంగి అధికారులు నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వెంటనే చేపల చెరువుల్లో ఉన్న గ్రేడింగ్ మిషన్లను తొలగించాలని, అనుమతుల్లేని చేపల చెరువుల నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెట్టాలని వెంకన్న డిమాండ్ చేశారు.

సాగర్ సిమెంట్ ట్రాన్స్‌పోర్టు

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన కంపెనీ ఎదుట నిరసన

ప్రజాశక్తి- కశింకోట

సాగర్ సిమెంట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. కశింకోట మండలంలో బయ్యవరం వద్ద ఉన్న సాగర్ సిమెంట్ కంపెనీలో పని చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కారం చేయాలని సోమవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7 నుండి 10 సంవత్సరాల కాలం నుండి పనిచేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ డ్రైవర్లకు మొదట్లో ఉన్న జీతాలే ఇస్తున్నారని, ఈ కాలంలో వేతనాలు పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 టైర్ల వెహికల్ డ్రైవర్‌కి రూ.650, 14 టైర్ల వెహికల్ డ్రైవర్‌కి రూ.600 24 గంటలు పని చేస్తే ఇస్తున్నారని, పైగా నెలలో ఎటువంటి సెలవులు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్ట్ మైలేజీని లీటరుకి గతంలో 2.2 పాయింట్లు, కమిషన్ రూ.2600 ఇచ్చేవారని, ఇప్పుడు లీటర్‌కు మైలేజీని 2.5కు పెంచేసారని, కమిషన్ మాత్రం రూ.1800కు తగ్గించేసారని పేర్కొన్నారు. ప్రమాదాల్లో రెండు కాళ్లు పోయిన డ్రైవర్‌కి ఇప్పటివరకు ఎటువంటి ఆర్థిక సహాయం చేయకపోవడం చాలా బాధాకరమన్నారు. నెలలో అన్ని రోజులు 24 గంటలు కేవలం ఒకే డ్రైవర్‌తో పనిచేస్తున్నారన్నారు. కనీసం డ్రైవర్‌కు తోడుగా మరో డ్రైవర్ గాని, క్లీనర్ గాని లేకపోవడం వలన దూరప్రాంతాలకు ఘాట్ రోడ్లలో లోడు తీసుకువెళ్తున్న సమయంలో నిద్ర కూడా పోకుండా పనిచేయాల్సిన పరిస్థితి దాపురిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లు బాగో లేనప్పుడు వెహికల్ టైరు పేలితే దాని మొత్తం ఖర్చు 18,000 నుండి 20,000 రూపాయల వరకు సంబంధిత డ్రైవర్ నుండే వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలపై సాగర్ సిమెంట్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థ అధినేత శ్రీకాంత్ రెడ్డిని వినతిపత్రాన్ని కార్మికులు అందజేశారు. అయితే సంస్థ అధికారులు వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐకి సంబంధించిన సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు వి.గోవింద్, ఎస్.మణిబాబు, ఎం. సత్యనారాయణ, పి. వరహాలు, ఎల్. అప్పలనాయుడు, జి. సన్యాసినాయుడు, సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సాగర్ సిమెంట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు

'రైతు పెట్టుబడి' నిధులు విడుదల చేయాలి

ఏపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-అనకాపల్లి

రాష్ట్ర ప్రభుత్వం రైతు పెట్టుబడి సహాయం, అన్నదాత సుఖీభవ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అధ్యక్షతన అనకాపల్లి కార్మిక కర్షక భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సూర్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల వ్యవసాయ పెట్టుబడులు నిమిత్తం రూ.20వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని ప్రకటించిందని తెలిపారు. సెప్టెంబర్‌తో వ్యవసాయ ఖరీఫ్ సీజన్ దాటి పోయినా నేటికీ పెట్టుబడి సహాయం అందించడంలో విఫలం చెందినట్లు పేర్కొన్నారు. దీంతో రైతాంగం అప్పులు కొరకు తీవ్రంగా ఇబ్బందులు పడవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయాలన్నారు. రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ జిల్లాలో వరి పంటకు వేయడానికి రైతు భరోసా కేంద్రాలు, సహకార సంఘాలలో యూరియా అందుబాటులో లేక బయట మార్కెట్లో ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సబ్సిడీపై యూరియా రైతులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.నాయనబాబు, ఎస్.శివ, ఎస్వి.నాయుడు, బి.రంగారావు, ఆర్.దేముళ్ళు, తాతారావు, రాము, సత్యనారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పిహెచ్‌సిల్లో కేంద్ర బృందం తనిఖీలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని అచ్యుతాపురం, హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సోమవారం కేంద్ర వైద్య బృందం తనిఖీ చేసింది. బృందం సభ్యురాలు జైత్ర నాయకత్వంలో పిహెచ్‌సిల్లోని రికార్డులు, పనితీరును పరిశీలించారు. సంక్రమిత అసంక్రమిత వ్యాధులపై పర్యవేక్షించారు. ఆరోగ్య కేంద్రాలలో లేబరేటరీ రూము, మందుల స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. బిపి, మధుమేహం, బ్రెస్ట్ క్యాన్సర్, గొంతు క్యాన్సర్, సర్వేకల్ క్యాన్సర్ తదితర వాటిని ఏరకంగా గుర్తిస్తున్నారో సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అటువంటి లక్షణాల కలిన వారికి ఎటువంటి మందులు ఇస్తున్నారని ప్రశ్నించారు. చీమలాపల్లి, దుప్పితూరు వెల్నెస్ సెంటర్లను సందర్శించారు. ఆయా గ్రామస్తులను కలిసి వైద్య సిబ్బంది సకాలంలో సేవలు అందిస్తున్నారా లేదా అని అడిగారు. మందులు ఉచితంగా ఇస్తున్నారా, సకాలంలో వైద్యశాల అందిస్తున్నారా అనే ప్రశ్నలను వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుండి రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ జయ ప్రశాంతి, డాక్టర్ ఎస్తేరు రాణి, అచ్యుతాపురం, హరిపాలెం పిహెచ్‌సిల వైద్యాధికారులు డాక్టర్ కె.శ్రావ్య, డాక్టర్ సుగుణ, ఆరోగ్య పర్యవేక్షకులు రమణబాబు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేణుగోపాల్, సూపర్వైజర్లు సునీత, ఉమా మహేష్, సన్యాసిరావు, ఆరోగ్య బోధకులు రామలక్ష్మి, నాగేశ్వరరావు అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు

కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ హెచ్చరించారు. అర్జీల వివరాలను జిల్లా కలెక్టరు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వినతులను కింది స్థాయి అధికారులకు అప్పగించకుండా స్వయంగా పరిశీలించాలని, సమస్యలపై స్వయంగా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలు వ్యక్తిగత, సామాజిక అంశాలపై 148 అర్జీలు అందజేశారు. రెవిన్యూశాఖకు సంబంధించి 76, జిల్లా పంచాయతీ శాఖకు 9, ఇతర శాఖలకు 63 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.దయానిధి, ఎస్డిసి రమామణి, సుబ్బలక్ష్మి, హౌసింగు పిడి శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎఎంఎఎల్ కళాశాలలో తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలి

స్థానిక ఎఎంఎఎల్ ఎయిడెడ్ కళాశాలలో తెలుగు సబ్జెక్టును పునరుద్ధరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్లో గ్రీవెన్స్‌లో సోమవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, జిల్లా కమిటీ సభ్యులు కె.అర్జున్ నాయుడు మాట్లాడుతూ ఎఎంఎఎల్ కళాశాలలో ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కోర్సులు ప్రాధాన్యత వల్ల జిల్లా నలుమూలల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో ఈ కళాశాలలో చదువుతున్నారని తెలిపారు. అలాంటిది కళాశాలలో తెలుగు లేకుండా చేయడం దారుణమన్నారు. తెలుగు సబ్జెక్ట్ కళాశాలలో లేక తప్పనిసరిగా సంస్కృతం ఇష్టం లేకపోయినా వేరే దారి లేక తీసుకోవాల్సి వస్తుందన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టం కలుగుతుందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎఎంఎఎల్ కళాశాలలో తెలుగు సబ్జెక్టుని పునరుద్ధరించాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

రాంకీ విడుదల చేసే కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

పరవాడ : మండల కేంద్రం పరవాడ ఊర చెరువు, పెద్ద చెరువు, సన్యాసి చెరువుల్లోకి మెల్లోడు గెడ్డ ద్వారా రాంకీ యాజమాన్యం అక్రమంగా ఫార్మా పరిశ్రమల నుండి విడుదలవుతున్న వ్యర్థ రసాయనిక జలాలను శుద్ధి చేయకుండా విడుదల చేయడంపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ కార్యాలయం జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో డిఆర్‌ఓ దయానిధికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. ఈ వ్యర్థ జలాల వల్ల చెరువులు, భూగర్భ జలాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద చెరువులో చేపలు చనిపోతున్నాయని, పశువులు జీవరాసులు నీళ్లు తాగడానికి పనికి రావడం లేదని, భరిణికం, పరవాడ, తానాం, లంకెలపాలెం, తాడి, సాలాపువానిపాలెం, గొర్లెవానిపాలెం, బొద్దపు వాని పాలెం, గ్రామాల ప్రజలు ఫార్మా కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముత్యాలంపాలెం సముద్ర తీరంలో కూడా వ్యర్థ జలాల శుద్ధి చేయకుండా విడుదల చేయడం వలన చేపల మృత్యువాత పడుతున్నాయని పేర్కొన్నారు.

డిఆర్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేత గనిశెట్టి

పశు బీమాతో పాడిరైతులకు ధీమా!

- ప్రీమియంలో ప్రభుత్వ రాయితీతో ఇన్సూరెన్స్ సదుపాయం
- పాడిరైతులు, జీవాల పెంపకందారులకు మహదావకాశం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువగా ఆధారపడి జీవించేది పాడి పరిశ్రమ మీదే. వ్యవసాయానికి పాడిపరిశ్రమ అనుబంధమైనప్పటికీ, భూములు లేనివారు సైతం ఒక పాడి పశువుల పెంపకం ద్వారా జీవనోపాధి పొందే పరిస్థితులున్నాయి. అయితే పాడి పశువులను కొనాలంటే ఒక్కొక్కటీ రూ.50 వేలు నుంచి రూ.80 వేల వరకు ఖర్చు అవుతుంది. అంతటి విలువైన పాడిపశువులు అనారోగ్యం, ప్రమాదాలు, ఇతరత్రా కారణాలతో పాడిపశువులుగానీ, జీవాలు గానీ మరణిస్తే రైతు ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో పాడిరైతులకు భరోసాగా ఉంటూ, వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చేందుకు పశువుల బీమా పథకం అందుబాటులో ఉంది.

పశువులు, జీవాలకు బీమా చేయిస్తే, ఏదైనా కారణంతో అవి మరణిస్తే, పాడిరైతులు, పెంపకదారులు ధీమాగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం పశువుల బీమాను అమలు చేస్తోంది. ఈ మేరకు దీనిపై ప్రజల్లో అవగాహనకు, వారిని భాగస్వాములను చేసేందుకు తగు చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ కు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. పశువుల బీమా చేసేందుకు లబ్ధిదారుల వాటాగా తెల్ల రేషన్ కార్డున్న వారు బీమా ప్రీమియంలో 20శాతాన్ని చెల్లిస్తే, మిగతా 80శాతాన్ని ప్రభుత్వం భరిస్తుంది. అదే

పాడి పశువులు

తెల్లరేషన్ కార్డు లేనివారు, ఎబోవ్ పావర్టీ లైన్ ఉన్నవారు 50శాతం ప్రీమియం చెల్లించాలని సూచించారు. పశువులకు మూడేళ్ళ పాటు, జీవాలకు 1, 2 లేదా 3 ఏళ్లకు బీమా పథకం వర్తిస్తుందని ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొంది.

రెండేళ్ళ నుంచి పదేళ్ల వయస్సు కలిగి ఒక్కసారైన ఈనిన ఆవులకు, మూడేళ్ళ నుంచి 12ఏళ్లలోపు వయస్సు కలిగి ఒక్కసారైన ఈనిన గేదెలకు బీమా పథకం వర్తిస్తుంది. ఒక కుటుంబానికి గరిష్ఠముగా ఐదు పశువులకు బీమా వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దేశవాళీ, సంకర జాతి ఆడ మరియు మగ పశువులకు రూ.30వేలు వరకు, నాటు జాతికి చెందిన ఆడ, మగ పశువులకు రూ.15 వేలు వరకు, ఆవులు/గేదెలల్లో గరిష్ఠంగా రూ.1.20 లక్షల వరకు, గొర్రెలు, మేకలకు గరిష్ఠంగా రూ.15 వేలు వరకు బీమా చేయించుకునే సదుపాయం ఈ పశు బీమా పథకంలో ప్రభుత్వం కల్పించింది.

బీమా ప్రీమియం వివరాలివి

పశుబీమా పథకం కింద రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను పశు సంవర్ధక శాఖ అధికారులు సూచించారు. రూ. 30వేలు విలువైన పశువులకు రూ.398, రూ.40 వేలు వరకు రూ.1061, రూ.50 వేలు విలువైన పశువులకు రూ.1723, రూ.60వేలు విలువైన వాటికి రూ.2385 చెల్లించాలని సూచించారు.

రైతుభరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలి

పశు బీమా సదుపాయం పొందేందుకు రైతులు తమ సమీపంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి తమ పేరు, పశువుల వివరాలను నమోదు చేసుకోవాలి. రైతు వాటాగా ప్రీమియం సొమ్మును ఆన్‌లైన్‌లో చెల్లించాలి. నర్సీపట్నం పరిధిలో గొలుగొండ, మాకవరపాలెం, నాతవరం, కోటవురట్ల మండలాల పాడి రైతులు పశు బీమా వినియోగించు కోవాలి. ప్రమాదవశాత్తు మరణిస్తే బీమాతో రైతులు ధీమాగా ఉండవచ్చు.

డాక్టర్ డబ్ల్యు.రాంబాబు, వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్, నర్సీపట్నం.

ప్రభుత్వ, సీలింగ్ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -కోటవురట్ల: ప్రభుత్వ, సీలింగ్ భూముల ఆక్రమణలకు గురయ్యాయని పందూరు సర్పంచ్ జగదీష్, ఎంపిటిసి సభ్యులు లక్ష్మి సహా పలువురు మాజీ ఎంపిటిసి సభ్యులు గ్రామస్తులు ఫిర్యాదు చేసినట్లు తాహసిల్దారు తిరుమలబాబు తెలిపారు,మండలంలో పందూరు రెవెన్యూ పరిధిలో కొండ్రపు అప్పలనాయుడు సుమారు 60 ఎకరాల భూమి కలిగి ఉన్నాడని, ఆ భూమికి సమీపంలోని సర్వేనెంబర్ 420లో 16 ఎకరాలతో పాటు సీలింగ్ భూములకు సంబంధించి 7.56 ఎకరాల భూమిని బినామీ పేర్లతో 40 సంవత్సరాలుగా అనుభవిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. బినామీ పేర్లతో పట్టాలు రూపొందించి, పలువురు చేతులు మారినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పందూరు పరిసర ప్రాంతంలో కారం మిల్లు ఏర్పాటుకు సర్వే నెంబరు 431-1ఎ, 1బి, 1సి, 1డిలో 7.56 ఎకరాల భూమిని కొండ్రపు అప్పలనాయుడు తన బంధువుల పేరుతో నమోదు చేయించుకుని గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తామని నమ్మబలికి అప్పటి అధికారులను ప్రజలను నమ్మించి భూమిని కాజేసి, ఆ భూమిని కూడా అనుభవిస్తున్నారన్నారు. తక్షణమే ఆయా భూములపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో చీకట్ల భాస్కరరావు, ఎడ్ల సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ప్రజాశక్తి -నక్కపల్లి : గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలు పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసిల్దార్ నరసింహమూర్తి అన్నారు. సోమవారం తహసిల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. సిహెచ్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన రాయుడు శీను డిజిటల్ సంతకం కోసం అర్జీని తహసిల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ నరసింహమూర్తి మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితుల సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా రాజేష్

ప్రజాశక్తి -కొత్తకోట :కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా రావికమతం మండలం కొత్తకోట జూనియర్ కళాశాల జువాలజీ అధ్యాపకులు వివిఎల్వి రాజేష్ ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన సమావేశంలో రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజేష్‌ను ప్రిన్సిపాల్ సత్యవతి సహచర అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా అభినందించారు.

సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రమేష్‌బాబు

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో రామచంద్రపాలెం గ్రామానికి చెందిన తమరాన రమేష్‌బాబు కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమితులయ్యారు. మానసిక శాస్త్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు దీంతో రామచంద్రపాలెంతోపాటు పరిసర ప్రాంత గ్రామస్తులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టు కార్డు ఉద్యమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్, రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వి.వి.రమణమూర్తి తెలిపారు.సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మీడియాతో మాట్లాడుతూ,ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ఆధ్వర్యాన 2025 జనవరి 27న లక్ష మందితో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు దశల వారీ చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు.ప్రతి ఇంటి నుంచీ కేంద్రానికి పోస్టు కార్డు పంపించి నిరసన గళాన్ని వినిపిస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం తక్షణమే రూ.10 వేల కోట్ల సాయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడతానని ప్రగల్భాలు పలికారని, కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయమై ఆయన ఎలాంటి తీపికబురూ చెప్పలేదని మండిపడ్డారు. ప్లాంట్‌ను మోడీ ప్రభుత్వం దొడ్డిదారిన ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని, అదానీ, జిందాల్ తదితర కార్పొరేట్ గ్రూపులకు లబ్ధి చేకూరేలా సహకరిస్తోందని ఆరోపించారు. గతంలో గంగవరం పోర్టును కూడా అదే మాదిరి ప్రైవేటుపరం చేసేశారని గుర్తుచేశారు. సుమారు 10 లక్షల మంది విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి బతుకుతున్నారని, అలాంటి కర్మాగారాన్ని ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమని అన్నారు.

పిజిఆర్‌ఎస్‌కు వినతుల వెల్లువ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : విశాఖ కలెక్టరేట్, జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)కు వినతులు వెల్లువెత్తాయి. ప్రజల నుంచి వచ్చే వినతులకు పరిష్కారం చూపడంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని, రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన అధికారులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత వారం అందిన ఫిర్యాదుల పరిష్కారం, తాజా పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ప్రజల నుంచి వివిధ సమస్యలపై 120 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి చెందినవి 48, జివిఎంసికి చెందినవి 29, పోలీసు శాఖకు సంబంధించినవి 9, ఇతర శాఖలకు సంబంధించినవి 34 ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌తో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సీతారామమూర్తి, జివిఎంసి ఎడిసి, ఇతర విభాగాల ఉన్నతాధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

జివిఎంసిలో 65 వినతులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 65 వినతులు వచ్చాయని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని పాత సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సిపి కార్యాలయానికి 58 ఫిర్యాదులు

పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 58 ఫిర్యాదులు వచ్చాయి. నగర సబ్ డివిజన్ ఎసిపిలు, అన్ని విభాగాల పోలీసాధికారులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో చేపల మృతిపై పరిశీలన

- హెటిరో వ్యర్థ జలాలు వల్లే మృత్యువాత పడ్డాయని మత్స్యకారుల ఆరోపణ
- కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సముద్రతీరం దొండవాక మొగ ఒడ్డుకు చేరిన మృతి చెందిన చేపలను సోమవారం కాలుష్యనియంత్రణ మండలి, మత్స్యశాఖ అధికారులు పరిశీలించారు. ఉప్పుటేరులో చేపలు మృత్యువాత పడి ఆదివారం ఒడ్డుకు చేరాయి. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మత్స్యకారులు ఆదివారం ఉప్పుటేరు వద్దకు వెళ్లి మృతి చెందిన చేపలను పరిశీలించారు. హెటిరో కంపెనీ వ్యర్థ రసాయన జలాలు ఉప్పుటేరులో వదలడం వల్లనే చేపలు మృతి చెందాయని ఆరోపించారు సమాచారం తెలుసుకున్న కాలుష్య నియంత్రణ మండలి శాఖ ఇఇ ముకుందరావు, మత్స్యశాఖ అధికారులు ప్రసాద్, షేక్ జాస్మిన్ సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు. మత్స్యకారులు తమ ఆవేదనను అధికారులు ఎదుట వెలిబుచ్చారు. హెటిరో కంపెనీ వ్యర్థ జలాలు శుద్ధి చేయకుండా సముద్రంలోకి, ఉప్పుటేరులోకి వదలడం వల్లనే సుమారుగా ఐదారు టన్నులు చేపలు మృత్యువాత పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుటేరులో ఇంత పెద్దఎత్తున చేపలు మృత్యువాత పడితే తామంతా ఎలా జీవనం సాగించాలని ఆవేదన వెలబుచ్చారు. ఉప్పుటేరు

మృతి చెందిన చేపలను పరిశీలిస్తున్న అధికారులు

మీద ఆధారపడి బతికే కొన్ని వందల కుటుంబాలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. తామంతా సముద్రం నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని, చేపలు వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదన్నారు.హెటిరో కాలుష్యం కారణంగా తమ బతుకులు ఆగమ్యగోచరంగా మారాయన్నారు. హెటిరో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం చెల్లించాలని కోరారు.కంపెనీ వ్యర్థ జలాలు ఉప్పుటేరులో కలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. మృతి చెందిన చేపలు, ఉప్పుటేరు లో నీటిని అధికారులు శాంపిల్స్ తీసుకొని తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గోసల స్వామి,భూలోక,నూకరాజు, దేముడు, కాశి, కాశీరావు, సోమేష్, కోదండరావు, ఎం శివాజీ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 14 దరఖాస్తులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక ఆర్‌డిఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 14 దరఖాస్తులు ప్రజలు అందజేశారని కార్యాలయ ఎఓ సూర్యనారాయణ తెలిపారు. మున్సిపాలిటీలో నీటి సమస్యలు తదితరాలుపైన దరఖాస్తులు వచ్చాయన్నారు. భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై మొత్తం అర్జీలు 14 ఇచ్చారని తెలిపారు. ఆర్‌డిఓ ఆదేశాల మేరకు ఆయా సమస్యలను పది రోజుల్లో పరిష్కారం అయ్యే విధంగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారన్నారని తెలిపారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి:ఐద్వా

బంగారు రంగు వస్తువులు, కూరగాయలతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సాయంత్రం పంది మెట్ట జంక్షన్ వద్ద జగదాంబ జోన్ ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ అధ్యక్షురాలు కె.మణి మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ఈ ఏడాది దసరా పండగ సక్రమంగా జరపలేక పోయామన్నారు. కూరగాయలు, వంట నూనెతో పాటు అన్నింటి ధరలు పెరిగాయని, వీటికి తోడు విద్యుత్తు చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు వేశారని ఆరోపించారు. మందుబాబుల ఆగడాలను అరికట్ట లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

స్థానిక నివాసి పద్మ మాట్లాడుతూ పిల్లలను కూడా చదివించలేని దుస్థితి ఏర్పడిందని, కరెంట్ బిల్లు చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జోన్ కార్యదర్శి ఆర్.వరలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నెరవేర్చ లేదన్నారు.వెంటనే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల నాయకులు కె. నర్సింగరావు, డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్, మత్స్యకారుల నాయకులు కె.చంద్రశేఖర్, సుబ్బారావు, విపి చంద్రమౌళి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

తహశీల్దార్‌ను సన్మానిస్తున్న బుజ్జి, టిడిపి నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఇటీవల తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నరసింహమూర్తి ని సోమవారం టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిసారు. ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టిడిపి నేత వెలగా శ్రీనివాసరావు, అమలాపురం పంచాయతీ సర్పంచ్ పెదపూడి శంకరరావు, పెదతీనార్ల ఎంపిటిసి సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, తోలేటి శ్రీనివాసరావు, గోవిందరావు తదితరులు తహసిల్దార్ నరసింహమూర్తిని శాలువా కప్పి సత్కరించారు. పలు రెవెన్యూ సమస్యలపై చర్చించారు.

నేషనల్ యూత్ బాక్సింగ్ పోటీలలో

మౌనికకు రజత పతకం

రజత పతకం సాధించిన మౌనిక

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : హరియాణాలో జరుగుతున్న బాక్సింగ్ ఫెడరేషన్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్, యూత్ నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో యూత్ కేటగిరిలో బొంతు మౌనిక 80కేజీల విభాగంలో రజత పతకం సాధించిందని శాఫ్ కోచ్ అబ్బు సోమవారం తెలిపారు. హరియాణాలోని స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఇండియా స్టేడియం సెంటర్‌లో జరుగుతున్న ఈ పోటీలు ఈనెల 6 నుండి 13 వరకు జరిగాయన్నారు. రతజ పతకం సాధించిన మౌనికకు రూ. 20వేలు నగదు బహుమతిని ప్రకటించారని అన్నారు. ఇండియన్ యూత్ బాక్సింగ్ క్యాంపునకు ఎంపిక చేసినట్లు ఎపి బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ లక్ష్మణదేవ్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆర్మీ కోచ్ సన్యాసిరావు , సీనియర్ కోచ్ శేఖర్ మంచి శిక్షణ ఇచ్చారని అబ్బు తెలిపారు.

ఎంపిడిఒకు అభినందన

ఎంపిడిఒకు జ్ఞాపిక బహూకరిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు

ప్రజాశక్తి - చీడికాడ : స్థానిక ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించిన వి.హేమచందర్‌ను మండలంలో రైతు సేవా కేంద్రాల్లో పశు సంవర్ధకశాఖ సహాయకులుగా పనిచేస్తున్న సిబ్బంది సోమవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అందరూ విధులలో సమయపాలన పాటించాలని సూచించారు. రైతులు, ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు మినీ గోకులాలను పూర్తి చేయడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు శరగడం శేషు, కొల్లి రాజేష్, వి.సాయి, కురచా అర్జునమూర్తి, మోర్తా శ్రీనివాసరావు ,మాధవి పాల్గొన్నారు

వేతన బకాయి చెల్లించాలని

కెజిహెచ్ సెక్యూరిటీ గార్డుల నిరసన

సిఐటియు ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి ఆందోళన

సిఐటియు ఆధ్వర్యంలో కెజిహెచ్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : కెజిహెచ్‌లోని సెక్యూరిటీ గార్డులకు సాయి గ్రూపు సెక్యూరిటీ సర్వీసెస్ కాంట్రాక్టర్ బకాయి ఉన్న రెండు నెలల జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కెజిహెచ్ సెక్యూరిటీ గార్డ్స్ ఆఫీస్ ఎదుట సెక్యూరిటీ గార్డులు నిరసన తెలిపారు. సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో ఎ షిఫ్ట్ విధులు బహిష్కరించి సెక్యూరిటీ గార్డులు నిరసన తెలిపారు. బకాయి జీతాలు చెల్లించాలని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యవైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కర్రి చంద్రశేఖర్, ఎం. సుబ్బారావు, కెవిపి చంద్రమౌళి తదితరులు నాయకత్వం వహించారు.

ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, మహిళా సెక్యూరిటీ గార్డులు విధులు నిర్వహిస్తుంటే వారికి నెలసరి జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. జీతాలు అడిగితే కంపెనీ వద్ద సొమ్ము లేదని, కంపెనీ నష్టాల్లో ఉందని, జీతాలు వేయలేమని చెబుతున్నారన్నారు. జీతాలు ఇమ్మని సెక్యూరిటీ గార్డులు అడిగినందుకు, విధి నిర్వహణలో ఉన్న వారిపై అనేక ఆంక్షలు విధిస్తూ పలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కెజిహెచ్ సూపరింటెండెంట్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామని, అయినా స్పందన రాలేదన్నారు.

విధులు బహిష్కరించి సెక్యూరిటీ గార్డుల నిరసనపై కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద స్పందించారు. సెక్యూరిటీ గార్డుల సమక్షంలో కాంట్రాక్టర్‌ను పిలిచి సంప్రదింపులు జరిపారు. జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో సెక్యూరిటీ గార్డులు నిరసన విరమించి, విధులకు హాజరయ్యారు.

వచ్చే నెల 23, 24న విశాఖ వేదికగా

జూనియర్ లిటరరీ ఫెస్ట్

19 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం

వివరాలు వెల్లడిస్తున్న ఉత్సవ డైరెక్టర్లు సోనాల్, సంధ్య, ప్రియ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : లిట్ లాంటర్న్ కల్చర్ అండ్ లిటరేచర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వచ్చేనెల 23, 24 తేదీలలో వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ 2024ను విశాఖ నగరంలోని బీచ్ రోడ్‌లోని హవా మహల్ వేదికగా నిర్వహిస్తున్నామని ఉత్సవాల డైరెక్టర్లు సోనాల్ సర్డ, సంధ్య గోడే, ప్రియ ఉప్పలపాటి తెలిపారు. సోమవారం సిరిపురంలోని వివాన్ హోటల్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2018లో ఈ ఫెస్ట్‌ను ప్రారంభించి, 2019లోనూ నిర్వహించా మని, అయితే కరోనా కారణంగా మూడేళ్లు నిర్వహించలేదన్నారు. 2023లో రెండుసార్లు నిర్వహించామని, ఐదో విడతగా వచ్చేనెల 23, 24 తేదీల్లో నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

విభిన్న కళలపై విశాఖ నగరంలోని చిన్నారులకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యంగా చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులకు కూడా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ఈ ఫెస్ట్ ద్వారా నిర్వహిస్తామన్నారు. చిన్నారులకు పుస్తకాలపై అవగాహన కల్పించేందుకు మంచి అవకాశమని, తల్లిదండ్రులు దీన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు 20 మందికి పైగా పుస్తక రచయితలు. కథా రచయితలు హాజరై, తమ కథలను చిన్నారులకు వివరిస్తారన్నారు. రెండు రోజుల పాటు ఆరు సెషన్లుగా నిర్వహించే ఫెస్ట్‌లో నాలుగేళ్ల నుంచి 16 సంవత్సరాల వయసు గల పిల్లలందరూ పాల్గొనవచ్చునని సూచించారు. దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్లను ఈనెల 19 నుంచి విశాఖ నగరంలోని విఐపి రోడ్‌లో ఉన్న తనిష్క్ షోరూమ్ లోను, జైల్ రోడ్డు వద్ద ఉన్న పేజెస్ బుక్ షాప్‌తో పాటు లాసన్స్ బే కాలనీని బుక్ మ్యూజిక్ లైబ్రరీలో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమ నిర్వాహక భాగస్వాములుగా సంధ్యా మెరైన్ లిమిటెడ్, దేవి సీ ఫుడ్స్, నెక్కంటి సీ ఫుడ్స్ లిమిటెడ్ సిఎంఆర్ షాపింగ్ మాల్, శారద మెటల్స్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్, వివన్ హోటల్స్ వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో సంధ్యా మేనేజ్ లిమిటెడ్ ఎండి ఆనంద్, పేజెస్ బుక్ స్టోర్ ఎండి సునీల్ నెవాటియ, కంకటాల ఎండి కంకటాల మల్లికార్జునరావు పాల్గొన్నారు.